క్లుప్తంగా

వైభవంగా బాలచౌడేశ్వరీదేవి ఉత్సవాలు

అనుమసముద్రంపేట: తొగట వీరక్షత్రియుల ఆరాధ్య దైవమైన శ్రీబాలచౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలను ఏఎస్‌పేట మండలంలోని హసనాపురం గ్రామంలో సోమ, మంగళ వారాల్లో వైభవంగా నిర్వహించారు. దేవాలయం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా తొగట వీర క్షత్రియులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జలదంకి పశు వైద్యాధికారి ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం జలదంకి మండలంలోని జమ్మలపాళెం, జలదంకి, గట్టుపల్లి తదితర గ్రామాల్లో పశువైద్యశిబిరాలు నిర్వహించి పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా టీకాలు వేశారు. అలాగే పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

ఉదయగిరి: నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు కొన్ని పాఠ్యపుస్తకాలను జిల్లా అధికారులు మంగళవారం కొండాపురం మండల విద్యావనరుల కేంద్రానికి ప్రత్యేక వాహనం ద్వారా తరలించారు. ఈ పాఠ్య పుస్తకాలను మండల విద్యాధికారి–2 ఆనందరావు నేతృత్వంలో సిబ్బంది స్థానిక కార్యాలయంలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపురం మండలంలో 67 పాఠశాలలు ఉండగా.. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు కొన్ని పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి వచ్చినట్లు తెలిపారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు త్వరలో వస్తాయని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



అల్లూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వినాయకుడి దేవస్థానం వద్ద మంగళవారం స్థానికులు కత్తుల శ్రీహరి, ప్రసాద్, ఆదినారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండతీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియ గ్రామంలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పొంగించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగలి సామగ్రిని కొత్త గంపల్లో పెట్టుకుని రామాలయం వద్ద నుంచి డప్పుల చప్పుళ్లు, బాణసంచా పేలుళ్ల మధ్య గ్రామోత్సవంగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి గ్రామం పాడిపంటలు, సిరి సంపదలతో విలసిల్లాలని మొక్కుకున్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై నాగార్జునరెడ్డి

సంగం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామనిఎస్సై నాగార్జునరెడ్డి హెచ్చరించారు. సంగంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముమ్మరంగా క్లోరినేషన్

వరికుంటపాడు: కలెక్టర్ ఆదేశాల మేరకు వరికుంటపాడు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎంపీడీఓ తోట కృష్ణకుమారి, ఈఓపీఆర్డీ సికిందర్ పర్యవేక్షణలో ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ పనులను పంచాయతీ కార్యదర్శులు ముమ్మరంగా చేయిస్తున్నారు. గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేసే తాగునీరు కలుషితం కాకుండా ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిల, పడమటికంభంపాడు, ఉప్పలపాడులోని పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మంగళవారం ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏఈ సైపుల్లా పఠాన్, ఈఏ ఆనంద్, ఆర్పీ సురేష్ ఉన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం



కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లు

- రసాయనాలతో మగ్గుతున్న మామిడి కాయలు
- విచ్చలవిడిగా కార్బైడ్ వినియోగం
- పట్టించుకోని అధికారులు

కావలి, బిట్రగుంట: కావలి పట్టణంలో ఎక్కడ చూసినా కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లే కనిపిస్తున్నాయి. సీజన్ ప్రారంభం నుంచే పక్వానికి రాని మామిడి కాయలను కృత్రిమ పద్ధతుల్లో మగ్గించి దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, చెరుకు రసాలు, అంటు మామిడి, నీలం రకం మామిడి పండ్లను పక్వానికి రాకముందే కోసి కార్బైడ్‌తో మగ్గబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. కృత్రిమ పద్ధతుల్లో పండించిన తరువాత పసుపు వర్ణంలో నిగనిగలాడుతున్న మామిడి పండ్లను రకాన్ని బట్టి కిలో రూ.100 నుంచి రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. కార్బైడ్‌తో మగ్గించిన పండ్లను తింటే పలు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. మామిడిపళ్ల సీజన్‌ను సొమ్ము చేసేకునేందుకు ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈదురుగాలులు, పడమటి గాలుల తీవ్రత పెరగడంతో తోటల్లో కాయలు రాలిపోతున్నాయి. వీటిని కార్బైడ్ ద్వారా ఒక్కరోజులోనే మగ్గబెట్టి హైవే పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో విక్రయిస్తున్నారు. రసాయనాలతో మగ్గబెట్టిన విషయం తెలియని ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేసి తిని ఇబ్బందులు పడుతున్నారు.

కార్బైడ్ వాడకాన్ని నిషేధించినా..

కృత్రిమ పద్ధతుల్లో కాల్షియం కార్బైడ్ వినియోగించి పండ్లను మగ్గబెట్టడాన్ని ప్రభుత్వం నిషేధించినా వ్యాపారులు లెక్కచేయడం లేదు. ఇతర పద్ధతులతో పోలిస్తే అతితక్కువ ఖర్చుతో, ఒక్క రోజులోనే కార్బైడ్ ద్వారా పండ్లను మగ్గబెట్టే అవకాశం ఉండడంతో వ్యాపారులు కార్బైడ్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కార్బైడ్ ద్వారా మగ్గించిన పండ్లను తింటే నోటిపూత, చర్మం ఎర్రబారడం, కళ్లు పొడిబారడం, నీరసం, వాంతులు తదితర సమస్యలు వస్తున్నా లెక్కచేయడం లేదు. చిన్నపిల్లల్లో సమస్య తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం కూడా ఉంది. ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారిన కార్బైడ్ వినియోగాన్ని అరికట్టే విషయంలో సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామిడి తోటల్లోనే కాయలను కార్బైడ్‌తో మగ్గబెడుతున్న విషయం తెలిసినా పట్టించుకోవడం లేదు. అసలు పండ్ల దుకాణాలవైపు కన్నెత్తి చూస్తున్న దాఖలాలు కూడా లేవు. దీంతో వ్యాపారులు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తున్నారు. మామిడితో పాటు సపోటా, అరటి పండ్లను మగ్గబెట్టేందుకు కూడా కార్బైడ్ వినియోగిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి కార్బైడ్ వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు



కావలి డీఎస్పీ వెంకటరమణ

కావలి: కౌంటింగ్ తేదీ సమీపిస్తున్న దృష్ట్యా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఆ వివరాలు మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

సాక్షి : ఎన్నికల కౌంటింగ్‌కు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

డీఎస్పీ : శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశాం. సమస్యాత్మక గ్రామాలు/ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, సంఘ విద్రోహ శక్తులను బైండోవర్ చేసుకుంటున్నాం. తరచుగా ఘర్షణలకు దిగే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి కట్టడి చేసే చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజూ ఫ్లాగ్ మార్చ్, కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, నాకాబందీ, వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ సంఘవిద్రోహ శక్తులకు హెచ్చరికలు జారీ చేస్తున్నాం.

సాక్షి : ఫ్లాగ్ మార్చ్‌తో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారు ?

డీఎస్పీ : సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని హెచ్చరిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాం. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తుగా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు కావలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాం. చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించాం.

సాక్షి : కార్డన్ సెర్చ్, నాకాబందిలతో ప్రయోజనం ఏంటి ?

డీఎస్పీ : కావలి సబ్ డివిజన్ పరిధిలో కార్డన్ సెర్చ్, నాకాబంది నిర్వహించాం. ఇది నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తూనే ఉంటాం. శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా ఎలాంటి ఘటనలకు తావులేకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నాం.

సాక్షి : వైఎస్సార్‌సీపీ నాయకులనే టార్గెట్ చేసి బైండోవర్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి?

డీఎస్పీ : వైఎస్సార్‌సీపీ నాయకులనే టార్గెట్ చేస్తున్నామనడం నిజం కాదు. కౌంటింగ్ సందర్భంగా ముందస్తు జాగ్రత్తగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను స్టేషన్‌లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఎవరినీ అనవసరంగా బైండోవర్ చేయడం లేదు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయాలనేదే మా లక్ష్యం.

ఉపాధి కూలీలకు గిట్టుబాటు వేతనం



బీకే అగ్రహారం పెద్దవాగులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శ్యామల

ఉదయగిరి: ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఐకేపీ ఏపీఓ శ్యామల సూచించారు. మంగళవారం జలదంకి మండలంలోని బీకే అగ్రహారం పెద్దవాగులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉందని, ఉపాధి కూలీలు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఉపాధి పనులు చేయాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రంగారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ జనార్దన్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతారామపురం: వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని సీతారామపురం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు ధీమా వ్యక్తం చేశారు. వారు మంగళవారం మండలంలోని పోలంగారిపల్లి గ్రామంలో నిర్వహించిన గంగమ్మజాతరలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన ప్రజలు ఆయనకు మద్దతుగా నిలిచారన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసే మేకపాటి కుటుంబంలోని రాజగోపాల్‌రెడ్డి విజయం సాధిస్తారని తెలిపారు. టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదేనన్నారు. నెల్లూరు ఎంపీగా విజయసాయి రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గండిపాళెం ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాముల రమణయ్య, నాయకులు తిరుమలరెడ్డి, గాజులపల్లి రామ్మోహన్‌రెడ్డి, కాకర్ల కృష్ణయ్యయాదవ్, సింగాల వెంకటరమణ, పాణెం చంద్రమౌళి, మద్దినేని శ్రీనివాసులు, గాజులపల్లి రామిరెడ్డి, పాణెం సుధీర్‌గౌడ్, రేనాటి సుధాకర్‌నాయుడు, లక్ష్మయ్య, రమణయ్య, ఉమామహేశ్వరరావు, పిడుగు నవీన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులపై సమీక్ష



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ గోపాల్

సీతారామపురం: నాడు–నేడు పనుల పురోగతిపై స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ ఈఓ గోపాల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి నాడు–నేడు పనులన్నీ పూర్తిచేసి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ షేక్ మస్తానవలి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్రావణ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

జామాయిల్ కర్ర తరలిస్తున్న వాహనం స్వాధీనం

ఉదయగిరి: మండలంలోని సర్వరాబాదు సమీపంలో ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ కర్రను నరికి మంగళవారం అక్రమంగా లారీలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని లారీని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో వెంకట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ నెహ్రూబాబు మాట్లాడుతూ సదరు భూమి రికార్డుల్లో డాటెడ్ ల్యాండ్‌గా నమోదై ఉందన్నారు. రికార్డులను పూర్తిగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

గంగమ్మకు బండ్ల పొంగళ్లు

సీతారామపురం: మండలంలోని పోలంగారిపల్లి గ్రామంలో గ్రామదేవత గంగమ్మకు మంగళవారం బండ్ల పొంగళ్లు పెట్టారు. గంగమ్మ తిరునాళ్ల ముగింపు సందర్భంగా చివరిరోజు గంగమ్మకు ప్రత్యేక అలంకరణ, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచి బండ్లను ప్రత్యేకంగా అలంకరించుకొని తప్పెట్లు మోతల నడుమ ఊరేగింపుగా గంగమ్మతల్లి ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ప్రముఖ సినీనటుడు, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలో ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు మంగళవారం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక రవితేజ కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఉదయగిరిలో..

ఉదయగిరి: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతి వేడుకలను ఉదయగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు అన్ని మండల కేంద్రాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లూరులో..

అల్లూరు: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతి వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏజెంట్ల నియామకాలు పూర్తిచేయండి

ఉదయగిరి: ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న నెల్లూరులోని ప్రియదర్శిని కళాశాలలో జరుగుతున్న నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకులు వారివారి కౌంటింగ్ ఏజెంట్ల నియామకాన్ని త్వరితగతిన పూర్తిచేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. కౌంటింగ్ సమయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 24 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఏఆర్వో నెహ్రూబాబు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని తిరుమలానగర్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణం మంగళవారం కనులపండువగా నిర్వహించారు. అర్చకులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియ



మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ నెల్లూరులోని ప్రియదర్శిని కళాశాలలో పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆత్మకూరు ఆర్డీఓ కె.మధులత తెలిపారు. మంగళవారం ఆత్మకూరులోని తన చాంబర్‌లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియకు ఏజెంట్ల నియామకం, పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. మొత్తం కౌంటింగ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కోసం 2 టేబుళ్లు, సర్వీస్ ఓట్ల లెక్కింపునకు ఒక టేబుల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీల నాయకులు ఏజెంట్‌లుగా 18 మందిని నియమించుకోవచ్చన్నారు. కాగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, సర్వీస్ ఓట్లు మొత్తం 3,150 పోలయ్యాయని, రౌండ్‌కు 500 చొప్పున ఓట్లు లెక్కిస్తారని ఆమె తెలిపారు. ఇవి మొదలు పెట్టిన అరగంటకే ఈవీఎంల ఓట్ల లెక్కింపును మొదలుపెట్టనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. కాగా నియోజకవర్గంలో మొత్తం 2,15,401 ఓట్లకుగానూ, 1,79,829 ఓట్లు పోలై 83.49 శాతం నమోదైందన్నారు. మొత్తం కౌంటింగ్ 20 రౌండ్లలో పూర్తయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. పార్టీల నాయకులు ఏజెంట్‌ల నియామకానికి 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జాబితాలు సమర్పించాలని తెలిపారు. ఉదయం 6.30 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు

- ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

ఆత్మకూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాలు, ఎస్పీ సూచనల మేరకు ఎన్నికల కోడ్‌తోపాటు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్న క్రమంలో ప్రజలు సమూహంగా గుమికూడరాదని, ఎలాంటి గొడవలు సృష్టించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ ఎన్.కోటారెడ్డి హెచ్చరించారు. ఆత్మకూరులోని తన కార్యాలయంలో మంగళవారం సీఐ జి.వేణుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఆ రోజు బాణసంచా పేల్చడం, నినాదాలు చేయడం, సమావేశాలు నిర్వహించడం లాంటివి చేయరాదని తెలిపారు. మద్యం దుకాణాలు జూన్ 3వ తేదీ సాయంత్రం నుంచి మూసివేస్తారని తెలిపారు. పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో పట్టకూడదని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా ప్రజలు సహకరించాలన్నారు. ఆత్మకూరు పట్టణం, రూరల్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో 2 వేల మందికిపైగా వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

శ్రీరామునికి హనుమంతసేవ



హనుమంత వాహనంపై కొలువుదీరిన సీతారామలక్ష్మణులు



ఆత్మకూరు: వెంకట్రావుపల్లి గ్రామంలో సీతారాముల కల్యాణం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామంలో ఉన్న రామమందిరంలో మంగళవారం సాయంత్రం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు ఆనందరావు నేతృత్వంలో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు సీతారాముల కల్యాణాన్ని వీక్షించి తరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామంలో రాములోరి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అర్ధరాత్రి శ్రీరామునికి హనుమంతసేవ నిర్వహించారు. సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తును సుందరంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్



ఉద్యోగ నియామక పత్రం అందుకుంటున్న విద్యార్థి

ఆత్మకూరు: విద్యార్థులు సాంకేతిక విద్య పట్ల ఆసక్తి పెంచుకొని ఆ కోర్సుల్లో ఉత్తీర్ణులైతే ఉపాధి అవకాశాలు వెంటనే దొరికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో మంగళవారం 'జాబ్ అఛీవర్స్ డే' నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాలలో 2024తో కోర్సు పూర్తయిన విద్యార్థులకు క్యాంపస్ ఎంపికలు జరిగి పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ అఛీవర్స్ డేలో నీటిపారుదలశాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఏడుకొండలు ముఖ్యఅతిథులు పాల్గొని మాట్లాడారు. కష్టపడి చదివిన వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. అనంతరం క్యాంపస్ ఎంపికల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ చెన్నై కంపెనీలో ఉద్యోగాలు సాధించిన 24 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాకానుక స్టాక్ పాయింట్ తనిఖీ



విద్యాకానుకను స్టాక్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ గోపాల్

సీతారామపురం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యాకానుక మండల స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ ఈఓ గోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామపురం మండలానికి వచ్చిన విద్యాకానుక కిట్లను పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు అందించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి, సీఆర్పీలు ఉన్నారు.